క్లుప్తంగా

'రక్త మార్పిడి' స్మారక నాణెం సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన స్లోవేకియా దేశం ముద్రించిన 'రక్త మార్పిడి' స్మారక నాణెం

అమలాపురం టౌన్: స్లోవేకియా దేశంలో మొట్ట మొదటి రక్త మార్పిడి జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ దేశం రక్త మార్పిడిపై ప్రజలకు అవగాహన కల్పించేలా ముద్రించిన రెండు యూరోల స్మారక నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. ఈ నాణెంపై మధ్యలో రెడ్ క్రాస్ గుర్తు, దానికి మధ్యలో ఒక రక్తపు బిందువు, చుట్టూ రక్తంలో గ్రూపులైన ఓ, ఏ, బీ, ఏబీ అనే అక్షరాలను, వాటి చుట్టూ 16 రక్త బిందువులను ముద్రించారు. ఈ నెల 14వ తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తాను సేకరించిన ఈ నాణేన్ని సేకరణకర్త కృష్ణ కామేశ్వర్ ప్రదర్శించారు.

వెయిట్ లిఫ్టర్, మాజీ కోచ్ రమేష్ మృతి



అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన తొలి తరం వెయిట్ లిఫ్టర్, బాడీ బిల్డర్, మాజీ కోచ్ తోరం రమేష్(59) మంగళవారం తెల్లవారుజామున రాజమహేంద్రవరంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ అనేక నేషనల్, స్టేట్ చాంపియన్ షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. స్థానిక గోపాల కృష్ణ గోఖలే జిమ్‌లో మంగళవారం జరిగిన సంతాప సభలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొని రమేష్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జరిగిన సంతాప సభల్లో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యనమల కృష్ణ పద్మరాజు తదితరులు రమేష్‌కు నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ముమ్మిడివరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జనవిజ్ఞాన వేదిక పరిరక్షణ కమిటీ జోన్ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం, దిశ దినోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో పాల్గొన్న కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయ సమితి నిర్ణయించిన ప్రకారం ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.మృత్యుంజయరావు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్, వెంకటరమణ, జనిపెల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగించిన వారిని అరెస్టు చేయాలి

తాళ్లరేవు: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలయ్యపాలెం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించినవారిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

కరుణాకరరావు సేవలు ప్రశంసనీయం

తాళ్లరేవు: ఫిషరీస్ ఏడీగా బి.కరుణాకరరావు చేసిన సేవలు ప్రశంసనీయమని సీహెచ్‌సీ డైరెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి అన్నారు. తాళ్లరేవు మండల ఫిషరీస్ ఏడీగా పనిచేసి కాకినాడ బదిలీపై వెళుతున్న కరుణాకరరావును మంగళవారం స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో సత్కరించారు. మత్స్య సంపద అభివృద్ధికి కరుణాకరరావు చేసిన సేవలను పలువురు ఆక్వారైతులు, మత్స్యకార నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో నూతన ఏడీ లావణ్య, ఎఫ్‌డీఓ గోపి, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొట్టేవారిపై చర్యలు తీసుకోండి

కాట్రేనికోన: కాట్రేనికోన గ్రామ సచివాలయం 3, 4ల్లో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది(ఎంఎల్‌హెచ్‌పీలు) విధులకు డుమ్మాకొడుతున్నారని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షుశుక్లాకు సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ మంగళవారం ఫిర్యాదుచేశారు. వీరిపై గతంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కామేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి నీలిమలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందించాల్సిన ఎంఎల్‌హెచ్‌పీలను కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యాధికారిణి నీలిమ పీహెచ్‌సీ అవసరాలకు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు.

ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్

- పల్లెల్లో విస్తృతంగా వైద్య సేవలు
- నెలలో రెండు సార్లు వైద్య పరీక్షలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



మంచాన పడిన వృద్ధురాలికి వైద్యం చేస్తున్న డాక్టర్ సుమ

అల్లవరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారు. ఇంటింటికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. దీని ద్వారా సచివాలయం పరిధిలోని ప్రజలకు నెలకు రెండు పర్యాయాలు వారి ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో వైద్య సేవలు విస్తృతమవ్వడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఉచితంగా నెలకి సరిపడా మందులు

ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ఇద్దరు డాక్టర్లు, ఏఎన్ఎం, డీఈఓ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్త సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఓపీ సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్య కారణాలతో మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి చికిత్స చేస్తున్నారు. వీరికి నెలకి సరిపడా మందులను అందిస్తున్నారు. అంతేకాకుండా 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేస్తున్నారు. దీంతో పాటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సేవలందిస్తున్నారు.

నాణ్యమైన వైద్యం అందుతుంది



నేను చాలా కాలంగా బీపీతో బాధపడుతున్నాను. సచివాలయంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ క్యాంపునకు వెళ్లి రెగ్యులర్‌గా వైద్య సేవలు పొందుతున్నాను. డాక్టర్లు పరీక్ష చేసి మందులిస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందుతుంది.

– కదలి కృష్ణమూర్తి, ఎన్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నాకు 70 ఏళ్లు. నా భర్త చనిపోయాడు. ఏ ఆధారం లేదు. బీపీ, షుగరు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. మా ఊరికొచ్చే ఫ్యామిలీ డాక్టర్‌కు చూపించుకుంటే నెలకి సరిపడా మందులిస్తున్నారు. మాలాంటి వృద్ధులకు ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రమణాతి సావిత్రి, వృద్ధురాలు

16న పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి యానాం రాక



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ ఈ నెల 16న యానాం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు తదితర అంశాలపై సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి అధికారులను ఆదేశించారు. మంగళవారం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ చాంబర్‌లో మత్స్య శాఖ, పీడబ్ల్యూడీ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖ, టౌన్ ప్లానింగ్, విద్య, వైద్యం తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్న నేపథ్యంలో పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ విలీనం సాహసోపేతమైన నిర్ణయం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని గోడిలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్‌ని శాలువాలతో సత్కరించారు. ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 52 వేల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.అబ్రహం, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కాంతారావు, ఉపాధ్యక్షుడు పీడీఎస్ బాబు, నాగభూషణం, జి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం స్థలం పరిశీలించిన జేసీ



గచ్చకాయలపోరలో పఱ్ఱ భూమిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన పంచాయతీ గచ్చకాయలపోర సముద్రతీరం సమీపంలోని 971 సర్వేనెంబరు పఱ్ఱభూమిలో ఏపీ టూరిజం కోసం ప్రభుత్వం సమకూర్చనున్న 17 ఎకరాల భూమిని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజానికి ఈ ప్రాంతం ఎంతో అనుకూలంగా ఉందని, రహదారి సౌకర్యంతో పాటు విశాలమైన పఱ్ఱ భూమి ఉందన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ఒక పక్క సముద్ర తీరంతో పాటు విశాలమైన పఱ్ఱభూమిలో బోటు షికారు చేసేందుకు అనువైన ప్రాంతమని చెప్పారు. జేసీ వెంట కాట్రేనికోన డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర



విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా మహాలక్ష్మమ్మ ఆలయం

యానాం: యానాం గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న మహాలక్ష్మమ్మ జాతరను పురస్కరించుకుని యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. జాతరలో గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆలయం వద్ద భక్తులు నిప్పుల గుండంపై నడిచి అమ్మవారిపై తమ భక్తిని చాటుకున్నారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఇందుపల్లి హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా పోటీ పడి ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. విద్యాకానుక పథకం ద్వారా జిల్లాలో 1,14,833 మంది విద్యార్థులకు రూ.27.77 కోట్ల విలువైన జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నామన్నారు. అమలాపురం నియోజకవర్గంలో 19,722 మంది విద్యార్థులకు రూ.4.63 కోట్ల విలువైన కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జగనన్న విద్యా కానుక కిట్లలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లు, మూడు జతల యూనిఫాం క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్‌తో పాటు ఇంగ్లిష్–తెలుగు డిక్షనరీలు ఉంటాయన్నారు. నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన తదితర పథకాలతో ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, సర్పంచ్ చొల్లంగి శివాని, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూడుపూడి నాగరాజు, హెచ్ఎం వి.శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ పోలమూరి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్



పెదగాడవిల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల వివరాలు అందజేస్తున్న పినిపే శ్రీకాంత్

ఉప్పలగుప్తం: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పెదగాడవిల్లిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు అంగీకరిస్తేనే ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ఆ పరిస్థితి లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల్ని చేరవేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్ జి.మహాలక్ష్మి, సర్పంచ్ బద్రి బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, జి.నాగరాజు, పరిమి రాధాకృష్ణ, పెయ్యిల కొండబాబు, కాశిన వెంకటేశ్వరరావు, తాళ్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వేంకటేశ్వరునికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి పలువురు భక్తులు మంగళవారం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపటానికి చెందిన వి.శ్రీనివాసరావు–సునీత దంపతులు స్వామికి రూ.10,116 విరాళంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెరచుకున్న ఫ్లడ్ ప్రొటక్షన్ గేట్లు

పి.గన్నవరం: కొత్త అక్విడెక్టు కాలువలో ఎల్.గన్నవరం వైపు నీటి ప్రవాహానికి మూసుకుపోయిన వరద రక్షణ గేట్లను మంగళవారం ఇరిగేషన్ అధికారులు ఓపెన్ చేయించి దిగువ ప్రాంతానికి నీటి సరఫరాను పునరుద్ధరించారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువకు ఇటీవల నీటిని విడుదల చేయడంతో, రిపేరులో ఉన్న గేట్లు సోమవారం మూసుకుపోయాయి. మంగళవారం కాలువలో నీటి మట్టాన్ని తగ్గించి, గేట్లను ఓపెన్ చేయించడంతో సమస్య పరిష్కారమైంది.

సీఎస్ఆర్ సేవలు కొనసాగించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్జీసీ) సంస్థ చేపడుతున్న సీఎస్ఆర్ సేవా కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుచేసినందుకు ఓఎన్జీసీ ఈడీ కాకినాడ ఎసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్, సీజీఎం డి.మాలిక్‌లను మంగళవారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యానాం సర్వతోముఖాభివృద్ధికి ఓఎన్జీసీ సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఓఎన్జీసీ సంస్థ రెండో గ్యాస్ పైపులైను వేస్తున్న నేపథ్యంలో వేట నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం చెల్లించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం జరగనుందని ఎంపీడీఓ రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు.

స్కూళ్లలో వాటర్ బెల్ ప్రారంభించాలి

యానాం: యానాం తదితర రీజియన్ స్కూళ్లలో విద్యార్థినీవిద్యార్థులు ఎక్కువ నీటిని తాగేలా 'వాటర్ బెల్'ను ప్రారంభించాలని మంగళవారం పుదుచ్చేరి విద్యాశాఖ జేడీ డాక్టర్ వీజీ శివగామి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఉదయం అసెంబ్లీలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నీటిని తాగాల్సిన ఆవశ్యకత, ఎంత నీరు తాగాలి, డీహైడ్రేషన్ వంటివి తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. స్కూల్స్‌లో రోజూ రెండుసార్లు వాటర్ బెల్ కొట్టాలని సూచించారు.

ధాన్యపు రాశి దగ్ధం



ఉప్పలగుప్తంలో దగ్ధమైన ధాన్యం రాశి వద్ద మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: ధాన్యపురాశి అగ్ని ప్రమాదానికి గురైన ఘటన చీకట్లపాలెంలో చోటుచేసుకుంది. స్థానిక రైతుల కథనం ప్రకారం మండలంలోని ఉప్పలగుప్తం పరిధిలోని చీకట్లపాలెం గ్రామంలోని రైతులు సలాది సత్యనారాయణ, సూర్యచంద్ర 15 ఎకరాల్లో రబీ సాగు చేసి ధాన్యాన్ని రాశులుగా చేసి ఉంచారు. ఖరీఫ్ సాగుకు నారుమడులు సిద్ధం చేసుకునే క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వరి చేను పక్కన ఉన్న కొబ్బరి ఆకులు, చెత్తను ఒకచోటకు చేర్చి మంట పెట్టి ఇళ్లకు వెళ్లిపోయారు. అదే సమయంలో గాలి ఎక్కువగా వేయటంతో మంటలు ధాన్యపు రాశికి అంటుకున్నాయి. స్థానికులు స్పందించి మంటలను అదుపుచేశారు. 15 ఎకరాల్లో 750 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని, దాంట్లో సుమారు 150 బస్తాల వరకూ అగ్ని ప్రమాదంలో దగ్ధమైందని గ్రామ వ్యవసాయ సహాయకుడు ఓలేటి శివాజి తెలిపారు.

చిన్నారి వైద్యానికి రూ.50 వేల ఆర్థిక సాయం



చిన్నారి వైద్యానికి రూ.50 వేల నగదును అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ మూర్తి

తాళ్లరేవు: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి పంపన ఉజ్వల లక్ష్మీ సాయిదుర్గకు వడ్లమూడి సావిత్రి చిన్మయి ఫౌండేషన్ ప్రతినిధులు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రస్తుతం సాయిదుర్గ విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన సాయిదుర్గ తండ్రి రామకృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్నారి వైద్యానికి సుమారు రూ.15 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయిదుర్గ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదును ఫౌండేషన్ చైర్మన్ వీవీఎస్ మూర్తి అందజేశారు.

ఘనంగా నీలపల్లమ్మ జాతర

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లిలో కొలువైన నీలపల్లమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జాతర మహోత్సవానికి తాళ్లరేవు మండల పరిధిలోని జార్జిపేట, నీలపల్లి, పి.మల్లవరం, యానాం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నడిపూడిలో ముత్యాలమ్మ జాతర

అమలాపురం రూరల్: నడిపూడి గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. గరగ నృత్యాలు, శక్తి వేషాలు, తీన్మార్ డప్పులు, మేళతాళాల నడుమ అమ్మవారి జాతర పుర వీధుల మీదుగా సాగింది. పాలగుమ్మి, నల్లమిల్లి, జనుపల్లి, ఈదరపల్లి, బండారులంక, అమలాపురం పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈదరపల్లిలో..

ఈదరపల్లి గ్రామ దేవత పోలేరమ్మ తీర్థం, జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ పోలిశెట్టి వీరబాబు, తిరునాధ అంజి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యాకానుకను సద్వినియోగం చేసుకోవాలి



కోదూరుపాడు హైస్కూల్లో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న నేతలు

అల్లవరం: ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కొనుకు గౌతమి అన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ జల్లి శ్రీను అధ్యక్షతన కోదూరుపాడు ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్పీటీసీ గౌతమి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుబ్బల రంగనాథస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను పాల్గొన్నారు. బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని గౌతమినగర్ ఎంపీపీ పాఠశాలలో జగనన్న విద్యా కానుకలను సర్పంచ్ విజయలక్ష్మి పంపిణీ చేశారు. తుమ్మలపల్లి ఎంపీపీ పాఠశాలలో ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరీ జగనన్న కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సోమిశెట్టి వెంకటేశ్వరరావు, దాకారపు శిరీష, కొంబత్తుల సంగీత, బొంతు పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

యానాం: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో దేశంలో 71వ ర్యాంకు పొంది ఐఏఎస్ సాధించిన యానాం మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్‌ను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘనంగా సత్కరించారు. ద్విజ్ గోయల్ స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ వద్ద హాపూర్ నివాసి. ఒక పక్క సివిల్స్‌కు సన్నద్ధమవుతూనే మరోపక్క యానాం కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన 2020లో మొదటిసారి సివిల్స్ ప్రిలిమ్స్‌కు వెళ్లినా మెయిన్స్‌కు ఎంపిక కాలేకపోయారు. అనంతరం 2021లో ఇంటర్వ్యూ వరకూ వెళ్లినా 5 మార్కుల వ్యత్యాసంతో తుది జాబితాలో చోటు కోల్పోయారు. గతేడాది అక్టోబర్ నెలలో సివిల్స్ పాసై అనంతరం మెయిన్స్, ఇంటర్వ్యూల్లో సైతం సత్తా చాటడంతో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

ద్విజ్‌గోయల్‌ను సత్కరిస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ →



ఎంపీడీవోకు కార్యదర్శుల సత్కారం

అమలాపురం రూరల్: నూతనంగా అమలాపురం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన జొన్నాడ వెంకటేశ్వరరావును కార్యదర్శుల సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కుడుపూడి భాగ్యలక్ష్మి, జిల్లా పీఆర్ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, పంచాయతీ కార్యదర్శులు కట్టా సత్తిబాబు, చేగొంటి సత్యానారాయణమూర్తి, కోడూరి వెంకటేశ్వరరావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న కాశీ విజయప్రసాద్ జిల్లా పరిషత్ ఏవోగా కాకినాడ బదిలీ అయ్యారు.